నమస్తే తెలంగాణ
మెదక్

I | హైదరాబాద్, మంగళవారం 3 సెప్టెంబర్ 2024 | MEDAK

మెదక్ జిల్లా వెల్దుర్తి మండలంలో మత్తడి దుంకుతున్న హల్దీవాగుపై ఉన్న వెల్దుర్తి-1చెక్‌డ్యామ్

మెదక్ జిల్లా పాపన్నపేట మండలంలోని ఏడుపాయల దుర్గమ్మ ఆలయం వద్ద మంజీరా పరవళ్లు

సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలంలో నీటితో కళకళలాడుతున్న సింగూరు ప్రాజెక్టు

గండి పడిన సింగూరు కాల్వ

సింగూరుకు పోటెత్తిన వరద

పుల్కల్, సెప్టెంబర్ 2 : సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండల పరిధిలోని బాగారెడ్డి సింగూరు ప్రాజెక్టుకు వరద పోటెత్తుతోంది. అప్రమత్తమైన నీటిపారుదలశాఖ అధికారులు ప్రాజెక్టు వద్ద ఉంటూ ఎప్పటికప్పుడు నీటి మట్టాన్ని పరిశీలిస్తున్నారు. జహీరాబాద్, మనూర్, ఝరాసంగం పరిసర ప్రాంతాల్లో కురిసిన వర్షాలతోనే ప్రాజెక్టులోకి వరద కొనసాగుతోంది. మూడు రోజుల నుంచి ప్రాజెక్టులోకి 2 టీఎంసీల నీరు వచ్చి చేరిందని, మరో మూడు టీఎంసీల నీరు వచ్చే అవకాశం ఉన్నదని ప్రాజెక్టు ఏఈ మహిపాల్ రెడ్డి తెలిపారు. కర్ణాటక, సైగామ్ ప్రాంతాల్లో అనుకున్నంతగా వర్షాలు లేక ఇప్పటివరకు వరద రాలేదన్నారు. సందర్శకులను ప్రాజెక్టుపైకి అనుమతించడం లేదు. రోజూ ఒక టీఎంసీ నీరు వచ్చి చేరితే ప్రాజెక్టు పూర్తిగా నిండేందుకు పది రోజులు పడుతుంది. ప్రాజెక్టులో 28 టీఎంసీలు దాటితేనే క్రస్ట్ గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేయడం జరుగుతుందన్నారు. 523.600 మీటర్లకు ప్రస్తుతం 521.200 మీటర్ల నీరు నీల్వ ఉన్నది. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 29.917 టీఎంసీలు ఉండగా ప్రస్తుత 18.903 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. ప్రాజెక్టులోకి వస్తున్న ఇన్‌ఫ్లో 22036 క్యూసెక్కులు, అవుట్ ఫ్లో 391 క్యూసెక్కులు వెళ్తున్నట్లు అధికారులు తెలిపారు.

తెగిన సింగూరు కెనాల్

భారీ వర్షాలకు పుల్కల్ మండలంలోని సింగూరు సిలారపు రాజనర్సింహ కాల్వ తెగిపోయింది. మండలంలోని ఇసోజిపేట వారులో ఉన్న సింగూరు కెనాల్‌లోకి వరద చేరి తెగిపోయింది. దీంతో వరద గ్రామ శివారులో ఉన్న చెరువులోకి చేరుతోంది. ఈవిషయమై ఇరిగేషన్ ఏఈ మహేశ్‌ను వివరణ కోరగా గతంలో కూడా కాల్వతెగిపోయిన మాట వాస్తవమేనన్నారు. నాలుగు రోజుల్లో కాల్వకు మరమ్మతులు చేపట్టి బాగు చేయిస్తామన్నారు.

తెగిన సింగూరు కాల్వను పరిశీలించడానికి వచ్చిన రైతులు

మత్తడి దుంకుతున్న సిద్దిపేట జిల్లా ఎన్సంపల్లి చెరువు

చెరువులకు వరద

- సిద్దిపేట జిల్లాలో పొంగిపొర్లుతున్న చెరువులు, చెక్‌డ్యామ్‌లు
- కూలిన ఇండ్లు..పలు గ్రామాలకు రాకపోకలు బంద్
- బెజ్జంకి మండలం తోటపల్లి వాగులో ఓ వ్యక్తి గల్లంతు

కోమటి చెరువు నుంచి నీరు ప్రవహించే కాల్వలో గుర్రపు డెక్కను తొలిగిస్తున్న అధికారులు

సిద్దిపేట, సెప్టెంబర్ 2:మూడు రోజులుగా సిద్దిపేట జిల్లాలో జోరుగా వర్షం కురుస్తోంది. సోమవారం కొంత వర్షం ఎడతెరిపి ఇవ్వడంతో ప్రజలు తమ పనులకు వెళ్లారు. శనివారం నుంచి వర్షాలు కురుస్తుండటంతో జిల్లా వ్యాప్తంగా చెరువులు మత్తళ్లు దుంకుతున్నాయి, చెక్‌డ్యామ్‌లు అలుగులు పారుతున్నాయి. కూడవెల్లివాగు, మందపల్లివాగు, అక్కెనపల్లి పెద్దవాగు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. నంగునూరు పెద్దవాగు బ్రిడ్జిపై నుంచి వరద ప్రవహిస్తుండటంతో ఖాతా,ఘన్‌పూర్ గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. వాగులు ప్రవహిస్తుండటంతో పోలీసులు సమీప ప్రాంతాల ప్రజలు, రైతులు, మత్స్యకారులను అటు వైపు వెళ్లవద్దని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా అనేక గ్రామాల్లో శిథిలావస్థలో ఉన్న ఇండ్లు కూలిపోగా మరికొన్ని ధ్వంసమయ్యాయి. సిద్దిపేటతో వరద నీరు నివాసప్రాంతాలకు వెళ్లకుండా అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. బెజ్జంకి మండలం తోటపల్లివాగులో చేపలు పట్టడానికి వెళ్లిన ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. అతడి ఆచూకీ కోసం పోలీసులు రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. సిద్దిపేట పట్టణంలో ఐదు ఇండ్లు కూలిపోయాయి.

అత్యధికంగా 16.63 సెంటీ మీటర్ల వర్షపాతం

సిద్దిపేట జిల్లా మిరుదొడ్డిలో అత్యధికంగా 16.63 సెంటీ మీటర్ల వర్షపాతం, అత్యల్పంగా హుస్నాబాద్‌లో 0.15 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది. మండలాల వారీగా చూస్తే మిరుదొడ్డిలో 16.6 సెం.మీ, సిద్దిపేట రూరల్‌లో 14.6 సె.మీ, నారాయణరావుపేట మండలంలో 14.5 సెం.మీ, కొండపాకలో 11.9 సెం.మీ,ధూళిమిట్టలో 11.3 సెం.మీ, తొగుటలో 10.9 సెం.మీ, దుబ్బాకలో 10.7 సెం.మీ, కుకునూరుపల్లిలో 10.6 సెం.మీ, మద్దూరులో 10.5 సెం.మీ, అక్కన్నపేటలో 10.4 సెం. మీ, మర్కూక్‌లో 10.1 సెం.మీ, నంగునూరులో 9.70 సెం.మీ, కోహెడలో 9.58 సెం.మీ, సిద్దిపేట అర్బన్‌లో 9.20 సెం.మీ, గజ్వేల్‌లో 9.19 సెం.మీ, జగదేవ్‌పూర్‌లో 9.14సెం.మీ, కోమురవెల్లిలో 9.05 సెం.మీ, చిన్నకోడూరులో 8.78సెం.మీ, దౌల్తాబాద్‌లో 8.15 సెం.మీ, వర్గల్‌లో 6.88 సెం.మీ, చేర్యాలలో 5.57 సెం.మీ, ములుగులో 5.41 సెం.మీ, రాయపోల్‌లో 4.44 సెం.మీ,అక్బర్‌పేటభూంపల్లి మండలంలో 4.40 సెం. మీ, బెజ్జంకిలో 1.70 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

వందల ఎకరాల్లో నీటమునిగిన పంటలు

- పాక్షికంగా కూలిన 223 ఇండ్లు
- అలుగు పారుతున్న 471 చెరువులు
- పొంగి ప్రవహిస్తున్న వాగులు, వంకలు
- పలు గ్రామాలకు నిలిచిపోయిన రాకపోకలు
- పొంగిన పోచారం ప్రాజెక్టు
- ఘనపూర్ ప్రాజెక్టుకు 10వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- పరిస్థితిని సమీక్షించిన మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

ఉధృతంగా ప్రవహిస్తున్న మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలంలోని గుండువాగు

మెదక్, సెప్టెంబర్ 2(నమస్తే తెలంగాణ): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మెదక్ జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం రాత్రి మొదలైన వానలు ఆదివారం రాత్రి వరకు తెరిపివ్వలేదు. జిల్లా వ్యాప్తంగా 707.3 మి.మీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా మెదక్‌లో 1010 మి.మీ వర్షపాతం నమోదు కాగా, అత్యల్పంగా మనోహరాబాద్‌లో 511.6 మి.మీ వర్షపాతం కురిసింది. ఘనపూర్ ప్రాజెక్టుకు 10వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. అంతేనీరు అలుగుపై నుంచి దిగువన ప్రవహిస్తోంది. పోచారం ప్రాజెక్టుకు 30 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. జిల్లాలో 2694 చెరువులు ఉండగా, ఆదివారం సాయంత్రం వరకు 471 చెరువులు అలుగు పారుతున్నాయి. 25 నుంచి 50 శాతం వరకు 461 చెరువులు నిండగా, 931 చెరువులు 50 నుంచి 75శాతం వరకు నిండాయి. 75 నుంచి 100 శాతం వరకు 831 చెరువుల్లోకి నీరు వచ్చింది. జిల్లాలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు 223 ఇండ్లు పాక్షికంగా కూలిపోయాయి. జిల్లాలో 165 ఎకరాల్లో వివిధ పంటలు నీటి మునిగాయి. ఇందులో హవేళీఘనపూర్ మండలంలో 105, బూర్గుపల్లిలో 35, రాజ్‌పల్లిలో 25 ఎకరాల్లో పంటలు నీట మునిగాయని మెదక్ జిల్లా వ్యవసాయాధికారి గోవింద్ తెలిపారు. వాగులు పొంగి ప్రవహిస్తుండడంతో రాకపోకలు స్తంభించాయి. మెదక్ మండల సమీపంలోని మల్కాపూర్ స్కూల్ తండాకు వెళ్లే రోడ్డు పూర్తిగా కొట్టుకుపోవడంతో రెండు రోజులుగా గిరిజనుల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మెదక్ మండలం తిమ్మానగర్ నుంచి రామాయంపేటకు వెళ్లే దారి కొట్టుకుపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. హవేళీఘనపూర్ మండలం దూప్‌సింగ్‌తండా వద్ద బ్రిడ్జి కుంగిపోవడంతో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. భారీ వర్షాల నేపథ్యంలో మెదక్ కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. విపత్కర పరిస్థితిని ఎదుర్కొనేందుకు యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైతే కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్ సెల్: 9391942254 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు. కంట్రోల్ రూమ్ 24 గం టలపాటు పనిచేస్తుందని పేర్కొన్నారు. కంట్రోల్ రూమ్ ద్వారా సమాచారం సేకరణ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు.

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం రంజోల్‌లో నీట మునిగిన పంటలను పరిశీలిస్తున్న అధికారులు

మెదక్‌లో మండలాల వారీగా వర్షపాతం(మి.మీ)

మండలం	వర్షపాతం(మి.మీ)
మాసాయిపేట	726.2
మెదక్	1010.0
చేగుంట	893.9
నార్సింగి	843.4
చిన్నశంకరంపేట	833.3
తూప్రాన్	687.8
రామాయంపేట	729.2
కొల్చారం	718.1
వెల్దుర్తి	687.3
నిజాంపేట్	706.6
పెద్దశంకరంపేట	682.9
రేగోడ్	690.5
పాపన్నపేట	679.1
టేక్మాల్	614.8
అల్లాదుర్గం	661.3
శివ్వంపేట్	616.9
హవేళీఘనపూర్	741.3
చిలిపిచెడ్	658.1
మనోహరాబాద్	511.6
కౌడిపల్లి	607.7
నర్సాపూర్	554.1

ప్రాణనష్టం జరగకుండా చర్యలు చేపట్టాలి

- మంత్రి దామోదర రాజనర్సింహ
- మంజీరా డ్యామ్‌ను పరిశీలించిన మంత్రి

సంగారెడ్డి శివారులో మంజీరా డ్యామ్‌ను పరిశీలిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

కంది/ సంగారెడ్డి కలెక్టరేట్, సెప్టెంబర్ 2: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ఎలాంటి ప్రాణనష్టం జరుగకుండా అధికార యంత్రాంగం పకడ్బందీ చర్యలు చేపట్టాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. సంగారెడ్డి శివారులోని మంజీరా డ్యామ్‌కు భారీగా వరద ఉధృతి కొనసాగుతున్నందున సోమవారం సాయం త్రం ఆయన పరిశీలించారు. వరద ఉధృతికి సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతిక్షణం అప్రమత్తంగా ఉంటూ వరద ఉధృతిని గమనించాలని సూచించారు. సంగారెడ్డి జిల్లాలో చెరువులు, వాగులు, కల్వర్టులు పొంగిపొర్లుతున్నందున జాగ్రత్తలు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వర్షాలతో పంటలు నష్టపోయిన రైతాంగాన్ని, ఆస్తి నష్టం జరిగిన బాధితులను ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలన్నారు. అనంతరం సంగారెడ్డి కలెక్టరేట్‌లో కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎస్పీ రూపేశ్, వివిధ శాఖల అధికారులతో భారీ వర్షాలపై మంత్రి సమీక్షించారు. కార్యక్రమంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండలంలో నిండుకుండలా నల్లవాగు ప్రాజెక్టు

సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలో అలుగు పారుతున్న హద్నూర్ పెద్దచెరువు

సంగారెడ్డి జిల్లా పుల్కల్‌లో ఇండ్ల మధ్యకు చేరిన వర్షపునీరు

రోజంతా జల్లులు.. కొనసాగిన వరద

- సింగూరు, నల్లవాగులోకి భారీ ఇన్‌ఫ్లో
- ఇసోజిపేట వద్ద సింగూరు ప్రధాన కాల్వకు గండి
- వర్షాలతో 623 ఎకరాల్లో నీటమునిగిన పంటలు
- పాక్షికంగా కూలిన 27 ఇండ్లు, పలుచోట్ల నీటమునిగిన ఇండ్లు
- పాటిఘనపురంలో నీటమునిగిన విద్యుత్ సబ్‌స్టేషన్
- పటాన్‌చెరులో పొంగిపొర్లిన నక్కవాగు, ఓఆర్‌ఆర్ సర్వీసు రోడ్డు జలమయం
- మంజీరా డ్యామ్ గేటు ఎత్తివేత, పరిశీలించిన మంత్రి దామోదర
- వర్షాలపై జిల్లా అధికారులతో మంత్రి దామోదర రాజనర్సింహ సమీక్ష

సంగారెడ్డి, సెప్టెంబర్ 2(నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లాలో రెండోరోజు సోమవారం మోస్తరు నుంచి భారీగా వర్షాలు కురిశాయి. పలు ప్రాంతాల్లో పాక్షికంగా ఇండ్లు దెబ్బతిన్నాయి.విద్యుత్ సరఫరాలో అంతరాయం చోటు చేసుకుంది. పుల్కల్ మండలంలోని ఇసోజిపేట వద్ద సింగూరు ప్రాజెక్టు ఎడమకాల్వకు గండిపడింది. వర్షాలతో సింగూరు, నల్లవాగు ప్రాజెక్టులోకి పెద్ద ఎత్తున వరద వస్తోంది. సంగారెడ్డి మండలం కల్పగూరులోని మంజీరాడ్యామ్ నిండటంతో ఒకగేటు ఎత్తి నీటిని కిందికి వదిలారు. సంగారెడ్డి జిల్లాలో 623 ఎకరాల్లో పంటలు నీటమునిగాయి. వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మంజీరా డ్యామ్‌ను పరిశీలించి వర్షాలపై సంగారెడ్డి కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించి ఆస్తి, ప్రాణనష్టం జరుగకుండా చర్యలకు ఆదేశించారు. జిల్లాలో 6 సెం.మీటర్ల సాధారణ వర్షపాతం నమోదైంది. మనూరు మండలంలో అత్యధికంగా 9.3 సెం.మీటర్ల వర్షం కురిసింది. 11 మండలాల్లో అధికంగా, 15 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. నారాయణఖేడ్, కల్హేర్, న్యాల్‌కల్, పటాన్‌చెరు మండలాల్లో 27 ఇండ్లు పాక్షికంగా కూలిపోయాయి. పటాన్‌చెరు మండలం చిట్కుల్‌లోని లోతట్టు ప్రాంతాల్లోని ఇండ్లు నీటమునిగాయి. పటాన్‌చెరు, అమీన్‌పూర్‌లోని లోతట్టు ప్రాంతాల్లో ఉన్న కొత్త కాలనీల్లో ఇండ్లు నీటమునిగాయి. పటాన్‌చెరులోని నక్కవాగు ఉప్పొంగి ప్రవహించడంతో ముత్తంగి-పోచారం ఔటర్ సర్వీసు రోడ్డు పూర్తిగా జలమయమైంది. పోలీసులు బారికేడ్లు పెట్టి వాహన రాకపోకలను నిలిపివేశారు. పటాన్‌చెరు మండలం పాటిఘనపురంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ నీటమునిగి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ సిబ్బంది మోటర్ల ద్వారా నీటిని తోడేశారు. స్థానిక ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సబ్‌స్టేషన్‌ను పరిశీలించారు. వర్షాలతో 623 ఎకరాల్లో పంటలు నీటమునిగాయి. జహీరాబాద్, నారాయణఖేడ్, అందోలు నియోజకవర్గాల్లో పంటలు నీటమునిగాయి. 258 ఎకరాల్లో సోయాబీన్, 50 ఎకరాల్లో మినుము, 28 ఎకరాల్లో పెసర, 171ఎకరాల్లో కంది, 102ఎకరాల్లో పత్తి, 14 ఎకరాల్లో కూరగాయ పంటలు నీటమునిగాయి.

మత్తడిదుంకిన 50 చెరువులు

సంగారెడ్డి జిల్లాలో 50 చెరువులు అలుగు పారుతున్నాయి. మొత్తం 1769 చెరువులు ఉండగా, 50 చెరువులు మత్తడి దుంకుతున్నాయి. సంగారెడ్డి ఇరిగేషన్ సబ్ డివిజన్‌లో 16, జహీరాబాద్ డివిజన్‌లో 21, నారాయణఖేడ్ డివిజన్‌లో 9, హత్నూరలో నాలుగు చెరువులు అలుగు పోస్తున్నాయి. జిల్లాలో 24 చెరువులు పూర్తిగా నిండగా, 686 చెరువులు 75 శాతం , 889 చెరువుల్లోకి 50 శాతం వర్షపునీరు వచ్చింది.

సింగూరు ప్రధాన కాల్వకు గండి

సింగూరు, నల్లవాగు ప్రాజెక్టులోకి వరద వస్తున్నది. సింగూరు ప్రాజెక్టులోకి సోమవారం 23942 క్యూసెక్కుల నీళ్లు వచ్చాయి. సిర్గాపూర్ మండలంలోని నల్లవాగు ప్రాజెక్టులోకి 338 క్యూసెక్కుల వరద వచ్చింది. ప్రాజెక్టులో ప్రస్తుత నీటిమట్టం 655 ఎంసీఎఫ్‌టీకి చేరుకుంది. మంజీరా నిండడంతో ఒక గేటు ఎత్తి దిగువకు 3100 క్యూసెక్కుల జలాలు వదిలారు. పుల్కల్ మండలం ఇసోజిపేట వద్ద సింగూరు ప్రాజెక్టు ఎడమకాల్వకు గండిపడి నీరంతా పొలాల్లోకి ప్రవహించాయి. ఎడమ కాల్వకు గతేడాది కూడా గండిపడింది.

నష్టపరిహారం వద్దు ..భూమే కావాలి

అందోల్: ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు, రైతులు

అందోల్, సెప్టెంబర్ 2: 'మాకు నష్టపరిహారం వద్దు..భూమికి బదులు భూమే ఇవ్వాలి...చావడానికైనా సిద్ధం..భూములు మాత్రం ఇవ్వం' అంటూ రీజినల్ రింగ్‌రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులు అధికారులకు తేల్చిచెప్పారు. సోమవారం సంగారెడ్డి జిల్లా అందోల్-జోగిపేట ఆర్డీవో కార్యాలయం ఆవరణలో భారత జాతీయ రహదారుల సంస్థ ఆధ్వర్యంలో ఆర్డీవో పాండు అధ్యక్షతన రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు అభిప్రాయాలను అధికారులకు తెలియజేశారు. వ్యవసాయంపైనే ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నామని, రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్నామని, తమకు భూములే ఇవ్వాలని...అది కుదరకుంటే న్యాయమైన పరిహారం ఇవ్వడంతోపాటు ఉపాధి చూపాలన్నారు. మరికొంత మంది రైతులు భూమికి బదులు భూమి ఇవ్వాలని, లేదంటే ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం నష్ట పరిహారం ఇవ్వాలన్నారు. మార్కెట్‌లో భూముల ధరలు కోట్లలో ఉంటే అధికారులు కేవలం రూ. 21లక్షలు చెల్లిస్తామని చెప్పడం సరికాదన్నారు. రైతుల నుంచి సేకరించిన అభిప్రాయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సరైన న్యాయం జరిగేలా చూస్తామని ఆర్డీవో చెప్పారు. రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు సరైన న్యాయం చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో డివిజన్ కార్యదర్శి విద్యాసాగర్ ఆర్డీవోకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పలువురు రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీకి మోకాలడ్డు..!

- రాజకీయ లబ్ధికి పేదలను ఇబ్బందులు పెడుతున్నవైనం
- సంగారెడ్డిలో నేటి కార్యక్రమం రద్దుపై లబ్ధిదారుల ఆగ్రహం
- బీఆర్ఎస్, స్థానిక ఎమ్మెల్యేకు పేరు వస్తుందని అడ్డుకున్న బడా కాంగ్రెస్ నేత

సంగారెడ్డి, సెప్టెంబర్ 2(నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లాలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీలో తీవ్ర జాప్యం జరుగుతున్నది. బీఆర్ఎస్ హయాంలో మంజూరైన చెక్కులను కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత విచారణ పేరుతో పంపిణీ చేయకుండా తాత్కాలికంగా నిలిపివేసింది. ఆ తర్వాత విచారణ చేపట్టి లబ్ధిదారులు అర్హులని తేలడంతో చెక్కుల పంపిణీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కానీ, ఐదు నెలలుగా చెక్కుల కోసం లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. లక్ష రూపాయలతో పాటు తులం బంగారం ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్ సర్కార్ హయాంలో మంజూరైన చెక్కుల పంపిణీని అడ్డుకోవడం సరికాదని, వెంటనే చెక్కులు పంపిణీ చేయాలని లబ్ధిదారులు డిమాండ్ చేస్తున్నారు. సంగారెడ్డి నియోజకవర్గానికి సంబంధించి సంగారెడ్డిలో సోమవారం 224 కల్యాణలక్ష్మి చెక్కులు, 194 షాదీముబారక్ చెక్కులను స్థానిక ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ లబ్ధిదారులకు పంపిణీ చేయాల్సి ఉండగా కార్యక్రమాన్ని అకస్మాత్తుగా రద్దు చేశారు. చెక్కుల పంపిణీకి జిల్లా మంత్రి దామోదర రాజనర్సింహ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినప్పటికీ, స్థానిక ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పంపిణీ చేస్తే బీఆర్ఎస్‌కు, ఎమ్మెల్యేకు పేరువస్తుందని సాకుగా చూపుతూ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని అధికార పార్టీకి చెందిన ఓ ముఖ్యనేత రద్దు చేయించినట్లు తెలుస్తుంది. దీంతో లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో కష్టాలు పడి, అప్పులు చేసి తమ బిడ్డల పెండ్లిళ్లు చేశామని, తమకు చెక్కులు అందేలా చూడాల్సిందిపోయి రాజకీయ కక్షతో చెక్కుల పంపిణీ అడ్డుకోవడం సరికాదని వాపోతున్నారు. చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని రద్దు చేయడంపై బీఆర్ఎస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పేదల కోసం పనిచేయాల్సిన ప్రభుత్వం రాజకీయాలు చేయడం తగదని వారు పేర్కొన్నారు.

జాతీయ రహదారి పనులు పూర్తి చేయాలి

- సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో వరద తాకిడి నివారణకు చర్యలు
- సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలి
- సమీక్షా సమావేశంలో రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, సెప్టెంబర్ 2: సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో జరుగుతున్న జాతీయ రహదారి పనులను త్వరగా పూర్తిచేయాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. పట్టణంలో హైవే పనులు నత్తనడకన నడుస్తున్నందున వర్షం పడినప్పుడు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, డ్రైనేజీ నిర్మాణ పనులు 15రోజుల్లో పూర్తి చేయాలని గడువు విధించారు. సోమవారం హుస్నాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో మున్సిపల్‌తోపాటు హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండలాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. పట్టణంలో జరుగుతున్న హైవే పనుల నిర్వహణపై మంత్రి అసహనం వ్యక్తం చేశారు. డ్రైనేజీ పనుల అనంతరం విద్యుత్ స్తంభాలు వేయడం, ఎంక్రోచ్‌మెంట్ ఉన్న వాటిని తొలిగించాలన్నారు. పోతారం నుంచి వచ్చే వరద డ్రైనేజీలోకి సక్రమంగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. హైవే పనులు నిబంధనల ప్రకారమే జరుగుతున్నందున ఎవరు అడ్డుకున్నా పోలీసు బందోబస్తు మధ్య పనులు పూర్తి చేయాలన్నారు. నాలాలపై నిర్మాణం, అక్రమ నిర్మాణాలు చేసిన వారికి నోటీసులు ఇవ్వాలన్నారు. భారీ వర్షాల వల్ల డెంగీ, మలేరియా, చికున్ గున్యా, టైఫాయిడ్ లాంటి వ్యాధులు ప్రబలుతున్నాయని, వీటిపై ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలన్నారు. సర్కారు దవాఖాన వైద్యులు సక్రమంగా విధులు నిర్వహించి రోగులకు వైద్యసేవ లందించాలన్నారు. దవాఖానల్లో ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఎక్కడ కూడా విద్యుత్ సమస్య లేకుండా చూసుకోవాలన్నారు. అక్కన్నపేట మండలంలో భారీ వర్షాల వల్ల రోడ్లు దెబ్బతిన్నట్లు తెలిసిందని, వాటిపై వెంటనే నివేదిక అందజేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. డిగ్రీ కళాశాల చుట్టూ చేరిన వర్షపు నీటిని బయటకు పంపేందుకు చర్యలు చేపట్టాలన్నారు. కోహెడ మండలం బస్వాపూర్ వద్ద రాకపోకలు నిలిచినందున నిర్మాణం పూర్తయిన బ్రిడ్జిని వెంటనే అందుబాటులోకి తేవాలని హైవే అధికారులను ఆదేశించారు. సమీక్షలో చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకట్, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనితారెడ్డి, కౌన్సిలర్లు, ఆర్డీవో రామ్మూర్తి, ఏసీపీ సతీశ్, కమిషనర్ మల్లికార్జున్, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.